# అఖిల పక్షాలు, సంఘాల సమావేశంపై శాసనసభలో ముఖ్యమంత్రి ప్రకటన

కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు, రాష్ట్రం ఎదుర్కొంటున్న విషమ పరిస్థితుల గురించి శాసనసభలో చర్చించుకుంటున్నాం. అక్కడ పార్లమెంటులో మన ఎంపీలు పోరాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం యావత్తూ ఆందోళనలో ఉంది. ఈ పరిస్థితులలో ఏం చేయాలి? ప్రజల తరపున ఎటువంటి పోరాటాలు చేయాలి? మనకు న్యాయంగా రావాల్సిన హక్కుల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఎలా వత్తిడి పెంచాలి? ఈ విషయాలపై సమాలోచన చేయడానికి నిన్న (27.03.2018 సోమవారం) ఉదయం సచివాలయంలో అఖిలపక్షాలు, సంఘాల సమావేశాన్ని నిర్వహించాం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం, 2014లోని అంశాలు, ఫిబ్రవరి 20న నాటి ప్రధానమంత్రి రాజ్యసభలో చేసిన ప్రకటనల అమలుస్థితిపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించాం.

మూడు పార్టీలు మినహా రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, జర్నలిస్టు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, వాణిజ్యసంఘాలు, ప్రవాస తెలుగు సమాజం ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరచిన అంశాలను అమలుచేయడంలో, ఆనాటి ప్రధానమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఈ సమావేశం ఏకగ్రీవంగా అభిప్రాయపడింది. ముఖ్యంగా ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్ర ప్రజలను కేంద్ర ప్రభుత్వం వంచించింది. రాష్ట్ర ప్రజలకు తీవ్రమైన అన్యాయం చేసింది.

నాలుగేళ్ల క్రితం ఒక జాతీయపార్టీ అశాస్త్రీయంగా రాష్ట్ర విభజన చేసి మనల్ని రోడ్డున పడేస్తే, మనల్ని ఆదుకుంటుందని, కష్టాల నుంచి బయట పడేస్తుందని నమ్మిన మరో జాతీయ పార్టీ ఈరోజు మనల్ని దారుణంగా వంచించిందని ఈ సమావేశంలో ఆగ్రహం వ్యక్తమైంది.

రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఈ రాష్ట్రంలో ఏ భావోద్వేగాలైతే కనిపించాయో అదే భావోద్వేగ సన్నివేశం నిన్నటి అఖిలపక్షాల, సంఘాల సమావేశంలో కనిపించింది. సమావేశంలో మాట్లాడిన ప్రతి ఒక్కరిలో మన రాష్టానికి జరుగుతున్న అన్యాయం పట్ల ఆవేశం పెల్లుబికింది.